## నేడు రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జర్నలిస్టుల ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, భీమయ్య, భుజంగారెడ్డి, ఆంజనేయులు, బాల సుబ్రమణ్యం తెలిపారు. శివరాంపల్లిలోని ఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. విజయానంద్ గార్డెన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు మ్యాచులు ఏర్పాటు చేశామని తెలిపారు. 78 మంది నాలుగు జట్లుగా పాల్గొనున్నుటుల పేర్కొన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతులను అందజేస్తామన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు, పిల్లలకు మ్యూజిక్ చైర్ , లెమన్ స్పూన్ తదితర పోటీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభ

రాజేంద్రనగర్: ఆదర్శ విద్యాలయ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో లఘు నాటికలు ప్రదర్శన, అలాగే ఇంగ్లీష్, గణితంలో ప్రాజెక్టులు చేసి ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎంఈవో రామిరెడ్డి హాజరై విద్యార్థులను ప్రశంసించి బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు గిరిజాదేవి, ఉప ప్రధానోపాధ్యాయురాలు కుమారి అఫ్సర్ షాహీన్, కిరణ్మాయి, నమ్రత, తులసీ పాల్గొన్నారు.

# ‘బండ్లగూడ’లో ట్విస్టులే..ట్విస్టులు

- రసవత్తరంగా కార్పొరేషన్ రాజకీయాలు
- కాంగ్రెస్ గూటికి మేయర్, కార్పొరేటర్లు
- సీఎం, మంత్రుల సమక్షంలో చేరిక



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పలువురు కార్పొరేటర్లు మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో రెండు నెలలుగా రాజకీయాలు ట్విస్టులు టర్న్‌లతో కొనసాగుతున్నాయి. ఇదిలాఉంటే కార్పొరేటర్ల ఎత్తులకు మేయర్ పై ఎత్తులు వేస్తూ కోర్టు నుంచి స్టే తెచ్చి మరీ అవిశ్వాసాన్ని ఆపి వేయించారు. దీంతో మరో నెలరోజుల పాటు బల నిరూపణకు బ్రేక్ పడండి. ఇదిలా ఉండగా మేయర్ మహేందర్‌గౌడ్ తన అనుచర కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మేయర్‌కు వ్యతిరేకంగా ఉన్న కార్పొరేటర్లు ఒక్కసారిగా షాక్‌కు గురైయ్యారు. మేయర్‌పై అవిశ్వాసం పెట్టిన కార్పొరేటర్లే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్తారని అనుకుంటున్న సమయంలో మేయర్ కాంగ్రెస్‌లో చేరడంతో ఇప్పుడు ఆ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటారా..? లేక బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతారా..? అనే అనే సందేహం ప్రజల్లో నెలకొన్నది.

**కార్పొరేషన్ అభివృద్ధి కోసమే : బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్**

బండ్లగూడ జాగరు మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మేయర్ మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి సోమవారం వారు కాంగ్రెస్‌లో చేరారు. మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, శ్రీలతాసురేశ్‌గౌడ్, పద్మావతీపాపయ్యయాదవ్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్‌కు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు



అందించేందుకు కష్టపడి పని చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉతన్నారు.

## దైవచింతన అలవర్చుకోవాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

బండ్లగూడ: ప్రతిఒక్కరూ దైవచింతనను అలవర్చుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని విజయాగణపతి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ 16వ వార్షికోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. తప్పకుండా హాజరై స్వామి వారిని దర్శించుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బఫర్‌జోన్‌లో ప్రహరీ కూల్చివేత



ప్రహరీని తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. గతంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన విల్లాలను తొలగించి ప్రాజెక్టు చుట్టూ నిర్మించిన ప్రహరీని అలాగే వదిలేశారు. ప్రస్తుతం కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సోమవారం ప్రహరీని పూర్తిగా తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ విక్రంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో ‘ నో బ్యాగ్ డే’



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తున్నదని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ప్రణీత అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సోమవారం నో బ్యాగ్ డేను నిర్వహించి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఒక రోజు నో బ్యాగ్ డేను జరుపుకోవడంతో అనేక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. అలాగే యోగా, ఆర్ట్ క్లాస్, వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛ భారత్, సెల్ఫ్ డిఫెన్స్, వ్యాసరచన, స్పెల్ బీ, మొక్కలు నాటడం, డ్రైవ్- ఫన్ గేమ్‌లు ఆడించారు. అదేవిధంగా దూరం నుంచి పాఠశాలకు వస్తున్న ఆరుగురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్లు స్వప్న, భార్గవ్, రవి, హైమంతి, శ్రీనివాసులు, కుమార్, సురశ్రీలతో పాటు గండిపేట వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన నాయకులు



దీపాదాస్‌మున్షీకి బొకే అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కష్టపడి పని చేయాలని సూచించారన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు పద్మావతీపాపయ్యయాదవ్, గోకరి శ్రీలతాసురేశ్‌గౌడ్, బుర్ర సాయి సాగర్‌గౌడ్, శ్రీనివాస్, పాండు, మల్లేశ్, రితేశ్, సాయి ఉన్నారు.

## అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

అత్తాపూర్: అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా ఇంతకుముందు పులి యాదగిరి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ వ్యవస్థ పనితీరుకు అనుగుణంగా పని చేస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పక్షపాత ధోరణి లేకుండా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## బిల్డింగ్ పై నుంచి పడి వృద్ధురాలి మృతి

రాజేంద్రనగర్: బిల్డింగ్ పై నుంచి పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీకాలనీకి చెందిన నితీశ్ తన కుటుంబ సభ్యులతో పాటు, తల్లి శారదాదేవి (70)తో కలిసి నివసిస్తున్నాడు. అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో వీరు ఉంటున్నారు. ఉదయం శారదాదేవి బాల్కనీలో బట్టలు ఆరేస్తూ ప్రమాదవ శాత్తు పై నుండి కింద పడింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



డీసీ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, డీఈ, వాటర్ వర్క్స్ జీఎంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే రాజేంద్రనగర్ డివిజన్ ప్రజలు పడుతున్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేటర్ అభివృద్ధి గురించి పార్టీ మారానని చెప్పుకొని ఎక్కడా కూడా కనిపించడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. బాబురావు మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ఎన్‌జేవైసీ యూత్ క్లబ్ వెనుకాల, ఆంధ్రాబ్యాంక్, జగ్జీవన్ రామ్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే శిశు మందిరం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, విఠల్, పులిమామిడి రవీందర్, పసుపుల సందీప్ ముదిరాజ్, ఆర్.రాకేశ్ గౌడ్, స్వామి, నాగుల కవిత తదితరులు పాల్గొన్నారు.

# వర్టికల్ గార్డెన్స్‌పై విద్యార్థులకు శిక్షణ



వర్టికల్ గార్డెన్స్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జీవనోపాధికి అవసరమైన వర్టికల్ గార్డెన్స్‌లో నైపుణ్యాభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అందమైన అలంకరణ మొక్కలతో వర్టికల్ గార్డెన్స్ ఏర్పాటు , సరైనా యాజమాన్య పద్ధతులను పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వర్టికల్ గార్డెనింగ్‌పై నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే సుస్థిరమైన ఆర్థిక ప్రగతితో పాటు పది మందికి జీవనోపాధిని చూపించగలుగుతారన్నారు. ముఖ్యంగా నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్స్, రహదారులకిరువైపులా ఎంతో అందంగా వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారని, దానివలన పచ్చదనంతో పాటు స్వచ్ఛమైన గాలి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ వర్టికల్ గార్డెన్స్‌ను ఇంటి లోపల బయట



వర్టికల్ గార్డెన్స్ శిక్షణ ఇస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఆవరణలోని గోడలకు వివిధ అందమైన అలంకరణ మొక్కలతో అలంకరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ మమత, కళాధర్‌బాబు, నాగహర్షిత, నిరోషా, సంతోషిని, శ్రీనివాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి





సైంటిఫిక్ రంగోళి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని గణేశ్‌నగర్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతి అన్నారు. సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్,సైంటిఫిక్ రంగోళి పోటీలను సోమవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో 20 మంది, క్విజ్‌లో 34 మంది, సైంటిఫిక్ రంగోళిలో 52 మంది పాల్గొన్నారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థుల మేధాశక్తి పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 15వ తేదీన పాఠశాలలో జరిగే ఫేర్‌వేల్ కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, ఉపాధ్యాయులు మాణిక్యంరెడ్డి, జాన్సన్, మహేశ్వరి, గోపాలా కృష్ణ, స్వాతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# చెరువు పనులు త్వరగా పూర్తి చేయిస్తాం



నెక్నాంపూర్ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

మణికొండ: అర్ధంతరంగా ఆగిపోయిన నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి చెరువు పరిసరాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించి, మురుగు నీరు చెరువులో కలవకుండా బాక్స్ డ్రైన్‌ల ద్వారా బయటకు వెళ్లేలా చేశారన్నారు. చెరువు సుందరీకరణ, బోటింగ్, గ్రీనరీ లాంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం రూ. 22 కోట్లతో ఏడేళ్ల క్రితం పనులు చేపట్టినా ఇప్పటివరకు సగం కూడా పూర్తి కాలేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు అవసరమయ్యే నిధులను విడుదల చేయిస్తామన్నారు. అంతవరకు చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను మున్సిపాలిటీ తరఫున పూర్తిగా తొలగించి దోమల వ్యాప్తిని నివారిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె. లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌చార్జి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశం గర్వించేలా యువత తయారవ్వాలి

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

గచ్చిబౌలి: దేశం గర్వించేలా యువత తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సత్యసాయిసెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సత్యసాయి సేవా సంస్థ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రేమ, దయ గుణాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవన్నారు. సత్యసాయి బాబా బోధించిన విధంగా మన జీవితాలకు మనమే బాధ్యులమని గ్రహించి ముందుకు సాగాలన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నా దేశంలో వృద్ధాశ్రమాలు పెరిగిపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రపంచానికి మనల్ని పరిచయం చేసిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వారిని విస్మరించరాదన్నారు. గ్రామసేవే రామ్ సేవ అని సమాజసేవ కార్యక్రమంలో పాల్గొంటూ దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎం యూఎస్ ఇండియా సీనియర్ డైరెక్టర్ రమేష్ కున్నట్, సలహాదారులు యూఎస్ కాన్సులేట్ అనిత లహరి, సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వరరావు 60 కళాశాలలకు చెందిన 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.


# ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ దళిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధ్యక్ష ,కార్యదర్శులు, సభ్యలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సలహాదారులు కల్లెం మల్లేశ్, సీహెచ్ మాన్యం, జీఎం కొమురయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు లింగాని రాజు, గడ్డం వెంకటేశ్, భీంరావు, శివ, అనిల్ , ప్రభుదాస్, బాలస్వామి, విక్రుతి, నరేశ్, చంద్రశేఖర్, వెంకట్, కరణ్, హరినాథ్, నరేశ్ , మొగులయ్య, దినాకర నవీన్, కృష్ణ, మాధవులు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

‘మనూ’ వీసీ ప్రొ.ఐనుల్‌హసన్



సదస్సులో పాల్గొన్న వీసీ ఐనుల్‌హసన్, హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్లు

రాయదుర్గం: సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ ఉర్దూ సైన్స్ కాన్ఫరెన్స్-2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ మానవ శరీరం ప్రతికూల పరిచయ వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీ సీనియర్ ప్రొఫెసర్ అహ్మద్ కమల్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఔషధాల తయారీ గురించి వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్‌సలావుద్దీన్ సయ్యద్, డాక్టర్ మాజిద్ అలీ చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సులో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు 150 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.

# కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి



సిద్ధిఖీనగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్యకర్తలు

గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు.కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో పార్టీ పరిస్థితిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని కాలనీ, బస్తీలలో పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై కార్యకర్తలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నందు, గోపాల్‌గౌడ్, ఫాజిల్, గణేష్, రవియాదవ్, వినయ్‌రెడ్డి, గాల్‌రెడ్డి, వెంకటస్వామి, అప్పల్‌కుమార్ యాదవ్, యోగిరెడ్డి, యాదయ్యగౌడ్, రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# ‘విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు’

గోల్కొండ: విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత తెలుగు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవలే నగర స్థాయిలో జరిగిన సైన్స్ క్విజ్ అండ్ ఎగ్జిబిషన్ పోటీల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీలు, మెమొంటోలు పొందారు. సోమవారం గోల్కొండలోని పాఠశాలలో వారిని పాఠశాల తరఫున అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉపాధ్యాయుల కృషి, ప్రోత్సాహం వల్ల తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి యేటా పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు పొందుతున్నారన్నారు. పాఠశాలకు చెందిన జగదీష్, సంజయ్, వైశాలి, హర్షద్ ట్రోఫీలు సాధించారని అదే విధంగా సిద్దార్, నక్షత్ర, ఆదిల్, నిజాం మెమొంటోలు సాధించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎస్.సుబ్బారావు, కవిత, ఎస్.సంధ్యారాణి తదితరులున్నారు.